చెరువులో తవ్వకాలు.. ప్రమాద ఘంటికలు

- గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే సొంత నిధులతో కోసిగి భూగేని చెరువు అభివృద్ధి పనులు
- కూటమి ప్రభుత్వం రాకతో నిలిచిపోయిన వైనం
- ఇదే అదనుగా భావించి అక్రమ మట్టి తవ్వకాలు
- చెరువులో గుంతలు ఏర్పడుతున్న వైనం
- చెరువును కాపాడాలని కోరుతున్న గ్రామస్తులు


భూగేని చెరువులో మట్టిని తవ్వేసిన అక్రమార్కులు


చెరువులో గట్టు పక్కనే చెత్తాచెదారం పడేసిన దృశ్యం

కోసిగి: మండల కేంద్రం కోసిగి గ్రామ శివారులోని భూగేని చెరువులో కొందరు రాత్రి వేళల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలతో గుంతలు ఏర్పడటంతో చెరువులో నీరు వచ్చినప్పుడు ఈతకు వెళ్లిన వారు ప్రమాదాలబారిన పడే ప్రమాదం ఉంది. గతంలో ఇలాంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో చెరువు పనులు..

గతేడాది ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ.40లక్షలు వెచ్చించి కోసిగి ప్రజలకు తాగునీటిని అందించేందుకు భూగేని చెరువులో నీరు స్టోరేజీ చేసే దిశగా మరమ్మతులు చేయించారు. నిరుపయోగంగా ఉన్న భూగేని చెరువులో పేరుకుపోయిన ముళ్ల పొదలు, గుంత గుంతలుగా ఉన్న చెరువును శుభ్రం చేయించి చదును చేయించారు. పులికనుమ రిజర్వాయర్ సమీపంలో బోర్ల నుంచి చెరువులో నీరు పంపింగ్ చేసి స్టోరేజీ చేయించి ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు 75 శాతం పనులు పూర్తి చేశారు. అయితే 2024లో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం రాకతో నిరుపయోగంగా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెరువు పనులు ముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో తాగునీటి స్టోరేజీగా ఉపయోగించాల్సిన భూగేని చెరువు మరలా నిరుపయోగంగా మారేస్థితికి చేరింది. ఇదే అదునుగా చూసుకుని కొందరు అక్రమార్కులు చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మట్టి తవ్వి గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండి గుంతలు కనిపించకుండా పోతున్నాయి. గతంలో గుంతలలో నిల్వ ఉన్న నీటిలో సరదాగా ఈతకు వెళ్లి గుంతలో ఇరుక్కుని నలుగురు చిన్నారులు మృతి ఘటన చోటు చేసుకుంది. చెరువులో గుంతలు పడకుండా కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే మరికొందరు చెత్తాచెదారంను చెరువులోను, చెరువు కట్ట పక్కనే పడేసి వెళ్లుతున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బంది కరంగా మారుతోంది.

బోర్డు ఏర్పాటు చేయిస్తాం



భూగేని చెరువును సమ్మర్ స్టోరేజ్ నిమిత్తం గత ప్రభుత్వ హయంలో పనులు చేయించారు. బడ్జెట్‌తో కూడుకున్న పని కాబట్టి పనులు అక్కడికే నిలిచిపోయాయి. చెరువులో అక్రమంగా చెత్తాచెదారం, మట్టి తవ్వకాలు జరుగకుండా పంచాయతీ తరుపున బోర్డు ఏర్పాటు చేసి, దండోర వేసి చుట్టు పక్కల ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– తిరుమలేశ్వ రెడ్డి, పంచాయతీ ఈఓ, కోసిగి

క్లుప్తంగా

రేపటి నుంచి వీరభద్రేశ్వర స్వామి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కోట భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని కోటనగర్‌లో వెలిసిన కోట భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి నూతన మహాద్వార, రథోత్సవ వేడుకలు ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దేవిశెట్టి మంజునాథ్ బుధవారం తెలిపారు. 11న ఉదయం గణపతి పూజ, ధ్వజా రోహణ, అభిషేకాలు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. నూతన మహా ముఖద్వారం, కలశ ప్రతిష్ఠాపన, స్వామి వారి కళ్యాణోత్సవం, మహాగణరాధన ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంట లకు పేట వీరభద్రేశ్వరస్వామి దేవస్థానం నుంచి కోట దేవస్థానం వరకు బాజాభజంత్రీల మధ్య ఊరేగింపు, 12న సాయంత్రం స్వామి వారి మహారథోత్సవం నిర్వహిస్తామన్నారు. 13న సాయంత్రం స్వామివారి వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

చంద్ర రాజేశ్వరావుకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: భూపోరాట యోధుడు పేదల పక్షపాతి చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. చంద్రరాజేశ్వర రావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ శేణులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట మల్యాద్రి, రంగన్న, పంపణ్ణ గౌడ్, భాస్కర్ యాదవ్, దాదావలి, కేసీ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందించడంతో పాటు మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి అన్నారు. బుధవారం కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థినిలకు మధ్యాహ్న భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లక్ష్మయ్య, పద్మావతి, లైబ్రేరియన్ శ్రీనివాసులు, లక్ష్మీప్రవంతి,కావ్యశ్రీ,హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: ఏడు వారాలకు సంబంధించి ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి టి.అయ్యప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఆరేకల్ గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతిరోజూ 200 మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారన్నారు. ఏడు నుంచి 9 వారాలుగా వేతనాలు అందక పోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాగిణి, వసంత, సావిత్రి, మహాదేవి, స్వయంప్రభ అన్నారు. బుధవారం ఆదోని అర్బన్ పరిధిలోని బీరప్పకాలనీ, ఇందిరానగర్, హనుమాన్‌నగర్, వాల్మీకినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారంపై కాలనీల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు రమాదేవి, నాగమ్మ, ప్రమీల, ఎస్‌టీఎస్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ, సుంకులమ్మ దేవర


ఐరన్‌బండలో పూర్ణకుంభాలతో వెళ్తున్న భక్తులు

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మ దేవరను గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు పూర్ణకుంభాలతో తప్పెట్లు, మేళతాళాలతో ఆయా దేవాలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ఆస్తి పన్నుపై ఐదు శాతం రాయితీ

ఆదోని టౌన్: ఈనెల 30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం పన్నులో రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ ఈనెల 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.సెలవు దినాల్లో కూడా పన్ను వసూలు కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

సీజ్ చేసిన ఎరువుల బహిరంగ వేలం


బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఏడీఏ బాలవర్ధి రాజు, ఏఓ రాజు

కోసిగి: సీజ్ చేసిన ఎరువులను బుధవారం కోసిగి వ్యవసాయ కార్యాలయంలో ఏడీఏ బాలవర్ధిరాజు, వ్యవసాయాధికారి రాజు ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. గతేడాది డిసెంబర్ నెలలో కోసిగిలోని ఓ దుకాణంలో స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా అందులో బిల్లులు లేకుండా అక్రమంగా నిల్వ ఉన్న ఎరువులను సీజ్ చేశారు. అందులో యూరియా 50 బస్తాలు, 14–35–14 ఎరువు 8 బస్తాలు, ఎంఓపీ 2 బస్తాలు ఉన్నాయని, వాటి విలువ రూ.30,685 ఉందని తెలిపారు. వేలంలో కృష్ణయ్య అనే రైతు రూ.17,100కు ఎరువులను కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు.

అంబేడ్కర్ జయంతిని పండుగలా జరుపుకుందాం

ఆదోని టౌన్: దళితుల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 135వ జయంతిని ప్రతిఒక్కరూ పండగలా జరుపుకుందామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఉపాధ్యక్షులు సాంబగల్లు బాలన్న పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని సాంబగల్లు గ్రామంలో ఉదయం 7 గంటలకు ఎస్సీ కాలనీలో ఘనంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. దళితులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కోసిగి: ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేద్దామని ఆ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కోసిగి, వివిధ గ్రామాల దళిత నాయకులతో కలిసి అంబేడ్కర్ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కర్రెప్ప, ప్రధాన కార్యదర్శిగా సామేల్, కోశాధికారి శ్రీరాములు, గౌరవ సలహాదారులుగా కొమ్ము రామన్న,ఈరన్న, లోకేష్, నరసయ్య, సల్మాన్ రాజుతో పాటు పలువురు కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఓటమి.. గెలుపునకు తొలిమెట్టు

కౌతాళం: ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం కౌతాళంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఆనంద్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రాజబాబు మాట్లాడుతూ టోర్నమెంటులో విన్నర్ జట్టుకు ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ అధ్యక్షుడు చెన్నబసప్ప రూ.10వేలు, రన్నర్ జట్టుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ రూ.5వేలు బహుమతిగా అందజేస్తాన్నారు. నాయకులు ఆనంద్, విజయ్ రామాంజి, ఉలిగప్ప, రెవన్న, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను అణచివేసేందుకే వక్ఫ్ సవరణ

ఆదోని రూరల్: దేశంలో ముస్లింలను అణచివేసేందుకే బీజేపీ కూటమి వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావిరాజు అన్నారు. బుధవారం స్థానిక నిజాముద్దీన్ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ భారత రాజాయగ పరిరక్షణకై పోరాడుదాం అంటూ కాలనీలో ప్రచార ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు షేక్షావలి, సీపీఐ నాయకులు లక్ష్మీనారాయణ, మెకానిక్ వలి, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మేళిగనూరులో రొట్టెల పండుగ


రొట్టెలు తీసుకొస్తున్న మహిళలు

కౌతాళం: మండల పరిధిలోని మేళిగనూరు గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామి జాతర మహోత్సవం ఈనెల 12న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగానే పాల్తూరు చెన్నవీరమహాస్వామి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రొట్టెల పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం మేళిగనూరు, చుట్టూ పక్కాల గ్రామాల ప్రజలు ఒక్కొక్కరు రెండు కేజీల రొట్టెలను తీసుకుని వచ్చి స్వామికి సమర్పించి, స్వామి సన్నిధిలో రొట్టెలతో భోజనాలు చేశారు.

జాతీయ స్థాయి డాడ్జి బాల్ పోటీలకు ఎంపిక


కురువ లాలప్ప

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి గ్రామానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి డాడ్జి బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన కురువ ఎంకోబు కుమారుడు కురువ లాలప్ప. గత నెలలో ఆదోనిలో ఆంధ్రప్రదేశ్ డాడ్జి బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పురుషులకు డాడ్జి బాల్ సెలక్షన్స్ జరిగాయి. ఈ పోటీల్లో లాలప్ప ప్రతిభను కనపరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి 27 వరకు కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో జాతీయ స్థాయి డాడ్జి పోటీల్లో పాల్గొనున్నట్లు లాలప్ప తెలిపాడు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి ఆ సంఘం జిల్లా అధ్యక్షు డు వీరేష్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించా రు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సతీష్, రాజశేఖర్, కార్తీక్, హనుమంతు పాల్గొన్నారు.

పాలిసెట్, ఎంసెట్‌కు ఉచిత కోచింగ్

ఆదోని రూరల్: ఆదోని పట్టణశివారులోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత పాలిసెట్, ఎంసెట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.సురేంద్రబాబు, కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. కళాశాలలో మెరుగైన కోచింగ్‌ను అందిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు రథోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శుక్రవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మహా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త యాజి కేశవర్ధన బుధవారం తెలిపారు. ఉదయం 9గంటలకు ఆంజినేయస్వామి దేవస్థానం, సోమప్ప సర్కిల్ సమీపంలోని శమీ వృక్షం నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వరకు రథోత్సవం కొనసాగుతుందన్నారు.

రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదు

ఆదోని అర్బన్: వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన స్థలంలో దేవాలయాలు నిర్మిస్తున్నారని కొంత మంది ఒకవర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు రంగన్న, లక్ష్మీనారాయణ, చంద్రమోహన్, కుంకనూరు వీరేష్, నరసన్న, గంగాధర అన్నారు. అభ్యుదయ దళిత సేవా సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వేనంబర్ 559ఏలో 50 సెంట్లు స్థలాన్ని గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు అంబేడ్కర్ భవనం నిర్మాణానికి కేటాయించారన్నారు. అయితే కొందరు దీనిపై కోర్టులో కేసు వేయడంతో నిర్మాణం చేపట్టలేదని, ఆ స్థలంలో లైబ్రరీ నిర్వహిస్తున్నామన్నారు. అయితే కొందరు దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత బుధవారం తెలిపారు. సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పౌర సరఫరా గోదాము తనిఖీ


గోదాములోని నిల్వలపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఆదోని పౌర సరఫరా గోదాము పాయింట్‌ను బుధవారం ఆదోని డివిజన్ సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ మేరకు గోదాములో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఉప తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్‌లై కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ అకౌంట్స్ షకీలా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాఠశాల తెరిచేనాటికి పుస్తకాల పంపిణీ


పాఠశాలలో గదులను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ మాధురి

గోనెగండ్ల : 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల తెరిచే నాటికి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తామని సమగ్ర శిక్ష స్టేట్ అబ్జర్వర్ ఎస్.మాధురి అన్నారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల చివరిలోపు అన్ని పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్టు వస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీటిని నిల్వ చేసేందుకు రూములను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ తోట శివ శంకర్, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ పాల్గొన్నారు.

ఘనంగా విన్సెంట్ ఫెర్రర్ జయంతి


చేయి చేయి కలుపుదాం సహాయం చేద్దామని ప్రతిజ్ఞచేస్తున్న ఆర్డీటీ బృందం సభ్యులు

కోసిగి: పేద ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన మహనీయుడు, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ అని ఆ సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య అన్నారు. బుధవారం కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాలలోని పలు గ్రామాల్లో విన్సెంట్ ఫెర్రర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వందగల్లు, గొడుగల్లు, కామన్‌దొడ్డి, కందుకూరు, సజ్జలగుడ్డం, జంపాపురం తదితర గ్రామాల్లో ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామాల్లో పురవీధుల గుండా ఆయన చిత్ర పటాన్ని ఊరేగించారు.

మరుగుదొడ్డి స్థలాన్ని కాపాడండి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బీరప్ప కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ మరుగు దొడ్డి స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని, స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు కోరారు. బుధవారం కాలనీ వాసులు దాదాపు 50 మందికి పైగా స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుపుకున్న పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి అక్కడికి చేరుకుని బాధితుల సమస్యను తెలుసుకుని, వారికి నచ్చ చెప్పి నిరసనను విరమింపజేశారు. బాధితులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడు, లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో వంటగ్యాస్ సిలిండర్లతో గ్యాస్ ధరలపై పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ముడి సరుకుల ధరలు తగ్గినప్పుడు గ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గుతాయన్నారు.అయితే ఇందుకు విరుద్ధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు పెంచడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అబ్దుల్లా, కాలప్ప,సుబాన్, బజారి.రాజు,తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న భారత్‌గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం

ఆదోని టౌన్: పట్టణంలోని గోకారిజెండా ప్రాంతంలో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో షాషావలికి ఆదోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వారు ఆర్థిక సాయంతో పాటు క నిండు సిలిండర్‌ను ఉచితంగా అందజేశారు. బుధవారం ఘటనా స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్‌డోకా సందర్శించి, బాధితా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆదోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వారితో మాట్లాడి.. బాధితుడికి సాయం చేయాలని కోరారు. స్పందించిన భారత్‌గ్యాస్ ఏజెన్సీ వారు బాధిత కుటుంబానికి సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదోని పట్టణాధ్యక్షుడు సాయినాథ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని మాధవరం రోడ్డు ఆర్టీఓ కార్యాలయం సమీపంలో రెండు లారీల్లో డీజిల్ చోరీకి గురైంది. రామకృష్ణ లారీలో రూ.3 లక్షల విలువ చేసే డీజిల్, సయ్యద్‌సమీర్ లారీలో రూ.2 లక్షల విలువ చేసే డీజిల్‌ను దొంగలించారని చెప్పారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

బస్టాండులో చోరీ

పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండులో కిలిచినపేటకు చెందిన సుజాత అనే మహిళ బ్యాగులో బంగారం చోరీకి గురైందని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈనెల 6వ తేదీన సుజాత బళ్లారికి వెళ్లేందుకు బస్టాండులో బస్సు కోసం వేచి ఉండగా.. బ్యాగులో ఉన్న 15 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగలించినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నర్సింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని సెంట్రల్: ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కోర్సుకు దరఖాస్తులు చేసుకోవాలని కస్తూర్బాగాంధీ మైనార్టీ విద్యాలయం ప్రిన్సిపాల్ అంజలిదేవి బుధవారం తెలిపారు. గతేడాది ఇంటర్మీడియెట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బైక్ పై నుంచి పడి మహిళకు గాయాలు

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామ సమీపంలో ఓ మహిళ బైక్‌పై నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కౌతాళం మండలం మల్లనహట్టి గ్రామానికి చెందిన జయలక్ష్మి, కుమారుడు తాయప్పతో కలిసి బైక్‌పై కోసిగిలో జరిగే బంధువుల వివాహానికి బయలుదేరారు. అయితే వందగల్లు గ్రామ సమీపంలో ఎండ తీవ్రతకు కళ్లు తిరిగి జయలక్ష్మి కింద పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా.. 108లో ఆదోనిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నం.: 72
(APMACS చట్టం, 1995 క్రింద నమోదైనది) RBI లైసెన్స్ నం: UBD, AP, 1671 P
#XIII/172, 173, షరాఫ్ బజార్, ఆదోని – 518 301, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.

న్యాయవారసులకు డిమాండ్ నోటీస్

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ (3)తో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద) లేట్ శ్రీ మహల్లి మొహమ్మద్ జీలాని తండ్రి శ్రీ ఎం.మొహమ్మద్‌గౌస్ గారి అభ్యర్థన మేరకు, బ్యాంక్ పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించడం ద్వారా వివిధ ఆస్తులపై రుణ సహాయం రూపంలో కాలానుగతంగా వివిధ రుణ సదుపాయాలు మంజూరు చేయబడినవి. బ్యాంక్ పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పిస్తూ టైటిల్ డీడ్స్ డిపాజిట్ చేయడం ద్వారా మీచే తనఖాపెట్టబడిన ఆస్తి (ఆస్తులు) వివరాలు దిగువ తెలియజేయబడినవి. బ్యాంక్‌కు బకాయి ఉన్న రుణ మొత్తం తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనందున, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాచే జారీ చేయబడిన మార్గదర్శకాల ప్రకారం మీ ఖాతాలు 08.02.2025న నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినవి. బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా కోరుతూ రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా 10.03.2025 తేదీగల డిమాండ్ నోటీసు పంపగా పోస్టల్ డిపార్ట్‌మెంట్‌చే వాపసు చేయబడినందున లేదా రుణగ్రహీత యొక్క న్యాయవారసులచే సంతకం చేయబడిన అక్నాలెడ్జిమెంట్స్ బ్యాంక్‌కు అందనందున, ఈ నోటీసు జారీ చేయబడినది.

లోన్ అకౌంట్ నం.MTL-200230141001089

న్యాయవారసుల పేర్లు మరియు చిరునామా: 1) ఎం.సహేరా ఖైతూన్ భర్త లేట్ ఎం.మొహమ్మద్ జీలాని, 2) ఎం.తాహేరా సుల్తానా తండ్రి లేట్ ఎం.మొహమ్మద్ జీలాని, 3) ఎం.నజియా సుల్తానా తండ్రి లేట్ ఎం.మొహమ్మద్ జీలాని, 4) మొహమ్మద్ సాతాహేర్ తండ్రి లేట్ ఎం.మొహమ్మద్ జీలాని, అందరి నివాసం: ఇం.నం.2-736, ప్లాట్ నం. 15, టీచర్స్ కాలనీ, ఆదోని -518302.

రుణ బకాయి: 10.03.2025 నాటికి రూ.8,97,130/- (ఎనిమిది లక్షల తొంభై ఏడు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే). మీరు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ॥ వాటితో పాటు పైన తెలిపిన మొత్తంపై 11.03.2025 నుండి వర్తింపుతో కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్యత్ వడ్డీని కూడా చెల్లించుటకు బాధ్యులై ఉన్నారు.

తనఖాపెట్టిన ఆస్తి వివరణ: శ్రీ మహల్లి మొహమ్మద్ జీలాని పేరున ఉన్న, SRO ఆదోని, డాక్యుమెంటు నం.10243/2021, తేది: 06-10-2021 ప్రకారం, మండిగిరి గ్రామం, సదాపురం గ్రామ పంచాయతీ, వార్డ్ నం.1, రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా ఆదోని, రిజిస్ట్రేషన్ జిల్లా కర్నూలు వద్దగల సర్వే నం. 752/1 పైకిలోని ఎ.0-70 సెంట్ల మొత్తంలో 37 చ.గజాల విస్తీర్ణపు అవిభాజ్య వాటా భూమితో కలిపి, 903 చ.అడుగులు (కామన్ ఏరియాతోపాటు) విస్తీర్ణం గల శిల్ప ఎలైట్‌లోని నాల్గవ అంతస్తు (బ్రోచర్ ప్రకారం)లో ఫ్లాట్ నం.401 యావత్తు. ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: ఖాళీ, పశ్చిమం: కారిడార్, ఉత్తరం: కారిడార్ మరియు ఖాళీ, దక్షిణం: లిఫ్ట్ మరియు ఖాళీ. భూమి సరిహద్దులు: తూర్పు: యాగంటి చంగలప్ప భూమి, పశ్చిమం: రోడ్, ఉత్తరం: అస్పరి రోడ్, దక్షిణం: ఆర్.తిమ్మన్న భూమి.

SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసులోని నిబంధనల మేరకు పైన తెలిపిన విధంగా భవిష్యత్ వడ్డీ, అనుషంగిక ఖర్చులు, వ్యయాలతో బకాయి ఉన్న పైన తెలిపిన మొత్తాన్ని ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో పైన తెలిపిన వ్యక్తి/ వ్యక్తులైన మీరు విఫలమైతే, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సదరు చట్టంలోని వర్తించే ఇతర నిబంధనల క్రింద వివరించబడిన అన్ని లేదా ఏవైనా హక్కులను బ్యాంక్ వినియోగించుకుంటుంది. చట్టంలోని ఏవైనా ఇతర నిబంధనల క్రింద తగినవని భావించిన విధంగా అట్టి ఇతర చర్యలు లేదా చట్టపరమైన ప్రొసీడింగ్స్ చేపట్టేందుకు బ్యాంక్ హక్కుకు ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఉంటుంది.

తేది: 09.04.2025
ప్రదేశం: ఆదోని
సం/- అధీకృత అధికారి
శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

